## విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్
- నర్మాల గురుకుల సాంఘిక సంక్షేమ పాఠశాలలో 9వ జోనల్ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



నర్మాల గురుకుల సాంఘిక సంక్షేమ పాఠశాలలో జ్యోతి ప్రజ్వలన చేసి 9వ జోనల్ స్థాయి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

గంభీరావుపేట, అక్టోబర్ 13: గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎస్పీ అఖిల్‌మహాజన్ సూచించారు. గంభీరావుపేట మండలం నర్మాల గురుకుల సాంఘిక సంక్షేమ పాఠశాలలో 9వ జోనల్ స్థాయి స్పోర్ట్స్ మీట్-2023 పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతిప్రజ్వలన చేసి క్రీడాపోటీలను ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసిందని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నర్మాల గురుకుల పాఠశాలలో మూడు రోజులపాటు నిర్వహించనున్న క్రీడాపోటీల్లో 13 పాఠశాలల నుంచి 1,105మంది విద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాలల డిప్యూటీ కార్యదర్శి శ్రీనివాస్, ఆర్‌సీవో మేరీ యేసుపాదం, నర్మాల పాఠశాల ప్రిన్సిపాల్ నిర్మల, ఆయా పాఠశాలల అధ్యాపకులు, పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, అక్టోబర్ 13: నగరంలోని పలు సబ్ స్టేషన్లలో నిర్వహణ, మరమ్మతులు చేపడుతున్నందున ఆయా సబ్ స్టేషన్ల పరిధిలోని ప్రాంతాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కరీంనగర్ టౌన్-1, 2, కరీంనగర్ రూరల్ ఏడీఈలు నరేందర్, సుధీర్ కుమార్, రాజు శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యానగర్, జ్యోతినగర్, భాగ్యనగర్, సంతోష్ నగర్, ఓల్డ్ లేబర్ అడ్డా, మామిడి తోట వెనక ప్రాంతం, ఆర్టీసీ వర్క్ షాప్, ఆదిత్య నగర్, ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వావిలాలపల్లి, బ్యాంక్ కాలనీ, మెహర్ నగర్, వరలక్ష్మీనగర్, జగిత్యాల రోడ్డు, కోర్టు రోడ్డు, సీతారాంపూర్, కాపువాడ, ఆటోనగర్, హౌసింగ్ బోర్డు, పోచమ్మవాడ, లక్ష్మీ నగర్ ప్రాంతాలకు విద్యుత్ ఉండదని తెలిపారు. అలాగే, ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శాతవాహన యూనివర్సిటీ, నగునూర్, బద్దిపల్లి, ఆసిఫ్‌నగర్, బావుపేట, ఖాజీపూర్ సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

### సీఎం కేసీఆర్‌ను మూడోసారి గెలిపించాలి

కలెక్టరేట్, అక్టోబర్ 13 : రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మూడోసారి గెలిపించాలని తెలంగాణ హజ్ కమిటీ సభ్యుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ కోరారు. తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతంతో కలిసి ఉమ్మడి జిల్లా రాజకీయాలపై తన నివాసంలో చాయ్ పే చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్బండ వర్గాల అభివృద్ధి బీఆర్‌ఎస్ పార్టీతోనే సాధ్యమని ఇప్పటికే రుజువైందన్నారు. రాబోయే రోజుల్లో కూడా ప్రగతిపథంలో పయనించాలంటే బీఆర్‌ఎస్‌నే గెలిపించాలని కోరారు. నవంబర్ 4వ తేదీన అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించే ప్రజాగర్జన సభను విజయవంతం చేసేందుకు నగరంలో ఇంటింటికీ ప్రచారం చేయాలని సూచించారు. దళితులు, మైనార్టీలు తెలంగాణలో పూర్తి రక్షణ పొందుతున్నారంటే కేవలం ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనతోనే సాధ్యమవుతుందనే అంశాన్ని వారికి అవగాహన కల్పించాలన్నారు. దేశంలో తెలంగాణ ప్రజలకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిన సీఎం కేసీఆర్ మరోసారి ముఖ్యమంత్రి పీఠం అధిష్టించే వరకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జీఎస్ ఆనంద్, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు షుకూర్, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు సముద్రాల అజయ్, బీసీ నాయకుడు బషీర్, తదితరులు పాల్గొన్నారు.

### ఐదుగురి బైండోవర్

రాంనగర్, అక్టోబర్ 13 : నగరంలోని కిసాన్‌నగర్‌కు చెందిన ఇద్దరు బెల్టుషాపు నిర్వాహకులు, ముగ్గురు గంజాయి నేరస్తులను తహసీల్దార్ ముందు బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ తాతాజీ తెలిపారు. క్యాదాసి ఆకాశ్, లింగంపల్లి అక్షయ్‌కుమార్, సిరిసిల్ల ప్రభాస్‌పై గంజాయి కేసులు ఉండగా, బెల్టుషాపు నిర్వాహకులు ఆకుల యాదయ్య, నర్సింగరావును బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.

## ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలి

- పనితీరును మెరుగు పరుచుకోవాలి
- విద్యుత్ ఎస్ఈ గంగాధర్
- ఉద్యోగులతో సమీక్షా సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ గంగాధర్

జమ్మికుంట, అక్టోబర్ 13: ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలని, నిత్యం పనితీరును మెరుగు పరుచుకుంటూ ముందుకు సాగాలని జిల్లా విద్యుత్ ఎస్ఈ గంగాధర్ సూచించారు. విద్యుత్ వినియోగదారులతో మర్యాదగా ప్రవర్తిస్తూనే, సకాలంలో బిల్లులు వసూలయ్యేలా విధులు నిర్వహించాలని ఆదేశించారు. శుక్రవారం ఆయన జమ్మికుంటకు వచ్చారు. జమ్మికుంట సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ ఉద్యోగులు, సిబ్బందితో పనితీరుపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. డీఈఈ, ఏఈఈ, సిబ్బందికి సంబంధించిన ప్రతి నెలా డిమాండ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు వసూలు చేసిన రెవెన్యూ, మిగిలిన రెవెన్యూకు సంబంధించిన వివరణ కోరారు. అనంతరం ఎస్ఈ మాట్లాడుతూ, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామని, సకాలంలో బిల్లులు చెల్లించే విధంగా వినియోగదారుల్లో చైతన్యం కలిగించాలని తెలిపారు. బిల్లుల చెల్లింపు విషయంలో విద్యుత్‌శాఖ అందిస్తున్న సదుపాయాలను వివరించారు. ప్రతినెలా డిమాండ్‌ను వంద శాతం వరకు వసూలు చేయిస్తున్న ఉద్యోగులు, సిబ్బంది పనితీరును మెచ్చుకున్నారు. ఉద్యోగులంతా వినియోగదారులకు అందుబాటులో ఉండాలని, ప్రభుత్వ కార్యాలయాలు, తదితర సబ్సిడీల నుంచి రావాల్సిన రెవెన్యూను రాబట్టాలని ఆదేశించారు. ఇక్కడ డీఈఈ లక్ష్మారెడ్డి, ఏడీఈ రాజేందర్, ఏఈలు సర్వేశ్వరాచారి(జమ్మికుంట టౌన్), రమేశ్(జమ్మికుంట రూరల్), రమేశ్(ఇల్లందకుంట), సత్యనారాయణరెడ్డి(చల్లూరు), త్రిమూర్తులు(వీణవంక), రవీందర్(తనుగుల), సబ్ ఇంజినీర్లు, సిబ్బంది, తదితరులున్నారు.

## తప్పుడు డాక్యుమెంట్లతో ఆరోపణలు

- పోలీసు ప్రతిష్ఠతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు
- కొత్తపల్లి ఎస్ఐ చంద్రశేఖర్




మాట్లాడుతున్న ఎస్ఐ చంద్రశేఖర్

రాంనగర్, అక్టోబర్ 13 : తప్పుడు డాక్యుమెంట్లతో గౌరవప్రదమైన వ్యక్తుల ఆరోపణలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కొత్తపల్లి ఎస్ఐ చంద్రశేఖర్ హెచ్చరించారు. కొద్ది రోజుల క్రితం చెట్టి వెంకటరమణపై చేసిన ఆరోపణలపై ఎస్ఐ వివరణ ఇచ్చారు. చెట్టి వెంకటరమణ గతంలో మల్కాపూర్ లో సర్వే నంబర్ 30 లో తనకు ఉన్న భూమిని కొందరు బడాబాబులు కబ్జా చేసి, అడ్డు వస్తే చంపేస్తామని బెదిరిస్తున్నారని ఆరోపణలు చేశారు. ఈ విషయంపై లోతుగా విచారణ జరుపగా చెట్టి రమణకు అసలు మల్కాపూర్‌లో ఎటువంటి భూమి లేదని, దీనిపై అతను వేసిన కేసుల్లో కోర్టు నిర్ధారించి కొట్టివేసిందని తెలిపారు. సర్వేనంబర్ 30 లో ఉల్లంగుల నర్సయ్య, జేరిపోతుల నర్సయ్య, గోనె లక్ష్మయ్య పట్టాదారులని, వారి వద్ద నుంచి చామనపల్లి మల్లయ్య 1971 లో కొనుగోలు చేసి తిరిగి 8 సంవత్సరాలకు విక్రయించాడని తెలిపారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం 1979 లో 35 గుంటల భూమిని ఆరుగురు వ్యక్తులు కొనుగోలు చేసి వారు దాన్ని అభివృద్ధి చేసి 16 ప్లాట్లుగా విభజించి 14 మందికి విక్రయించడం జరిగిందన్నారు. ఇందులో జేరిపోతుల లింగయ్య అనే వ్యక్తి వద్ద 2007 లో భూమి కొనుగోలు చేసినట్లు చెట్టి వెంకటరమణ ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించి కేసు వేశాడని, ప్లాట్లు కొనుగోలు చేసిన వారిని బెదిరించి అక్కడ ఇండ్లు నిర్మిస్తున్న బిల్డర్ వద్ద నుంచి డబ్బులు డిమాండ్ చేసి రూ.20 లక్షల వరకు వసూలు చేసినట్లు సమాచారం ఉందన్నారు. 2022 లో ప్లాట్ల యజమానులు ప్రహరీ నిర్మించుకోగా అర్ధరాత్రి సమయంలో వాటిని అక్రమంగా కూల్చివేసిన ఘటనపై అప్పటి పోలీసులు వెంకటరమణపై కేసు నమోదు చేశారన్నారు. దీనిపై కోర్టులో చార్జిషీటు దాఖలు చేయగా, రెవెన్యూ అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు వారి వద్ద ఉన్న డాక్యుమెంట్లు ఫోర్జరీవని తెలిసి కోర్టు కొట్టివేసిందని వివరించారు. తప్పుడు డాక్యుమెంట్లు చూపిస్తూ గౌరవ హోదాలో ఉన్న వ్యక్తులతో ప్రాణహాని ఉందని, పోలీసులు కూడా తనను ఇబ్బందులకు గురి చేస్తున్నారని పత్రికా సమావేశాలు పెట్టి నిరాధారమైన ఆరోపణలు చేశాడన్నారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## శాసనసభ ఎన్నికలకు పటిష్ట భద్రత

- రంగంలోకి కేంద్ర బలగాలు
- రెండు రోజుల్లో కరీంనగర్ జిల్లాకు రాక

రాంనగర్, అక్టోబర్ 13: సార్వత్రిక ఎన్నికలకు సైరన్ మోగడంతో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ఇప్పటికే జిల్లాలో ఎన్నికలు నిర్వహించేందుకు పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమీక్షలు జరిపిన యంత్రాంగం కమిషనరేట్ పరిధిలో 1338 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనుంది. వీటిలో 1048 సాధారణ పోలింగ్ కేంద్రాలు, 290 సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించారు. ఇప్పటికే ఈ ప్రాంతాలపై దృష్టి పెట్టిన పోలీసులు భద్రత కూడా అదే స్థాయిలో ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేశారు. సాధారణ పోలీసులతోపాటు ఏఆర్, డిస్ట్రిక్ గార్డ్ సిబ్బంది కూడా పూర్తిస్థాయిలో ఎన్నికల కోసం భద్రత ఏర్పాట్లలో భాగంగా విధులు నిర్వర్తించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు జరుగనుండడంతో అందుబాటులో ఉన్న సిబ్బంది భద్రతా విధులకు సరిపోయే అవకాశం లేక పోవడంతో కేంద్ర బలగాలని కూడా వినియోగించనున్నారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా వంద కంపెనీల కేంద్ర బలగాలు ఇప్పటికే రాజధానికి చేరుకున్నాయి. జిల్లాల వారీగా సమస్యాత్మక ప్రాంతాలను దృష్టిలో పెట్టుకొని ఒక్కో జిల్లాకు కేంద్ర అదనపు బలగాలను పంపనున్నారు. దీనిలో భాగంగా కరీంనగర్ కమిషనరేట్‌కు ఐదు కంపెనీల బలగాలు రానున్నాయి. కేంద్ర బలగాలకు పోలీస్ శిక్షణ కేంద్రంలో వసతి ఏర్పాటు చేయనున్నారు. కేంద్ర బలగాలు రంగంలోకి దిగిన తర్వాత కమిషనరేట్ వ్యాప్తంగా కవాతు నిర్వహించనున్నారు. అదనపు బలగాల సేవలను చెక్ పోస్టులు, ఎన్నికల ప్రచారం కోసం వచ్చే వీవీఐపీల భద్రతకు, పోలింగ్ కేంద్రాలు, సమస్యాత్మక ప్రాంతాల్లో వినియోగించనున్నారు.

## రసమయికే మా ఓటు

ఇల్లంతకుంట, అక్టోబర్ 13: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కే మా ఓటు వేసి, బీఆర్ఎస్ పార్టీకి మద్దతుగా ఉంటామని గొల్లపల్లి గ్రామస్తులు స్పష్టం చేశారు. శుక్రవారం వారు జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు కార్యాలయంలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కు మద్దతు ప్రకటించారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా రసమయిని మూడోరి అధిక మెజార్టీతో గెలిపించుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు కృతజ్ఞతలు చెప్పారు. ఇక్కడ సోమారంపేట సర్పంచ్ కాచం శ్రీనివాస్‌రెడ్డి, గ్రామస్తులు పత్రి అంజయ్య, బీరయ్య, కనకయ్య, తదితరులు ఉన్నారు.

### ప్రధాన కార్యదర్శిగా సుదర్శనం

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 13 : కరీంనగర్ జిల్లా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం ప్రధాన కార్యదర్శిగా మానకొండూర్ మండలం అన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నలుమాసు సుదర్శనం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన బదిలీల్లో కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన సత్తు పురుషోత్తం పెద్దపల్లి జిల్లాకు బదిలీ కాగా, రాష్ట్ర కమిటీ సూచన మేరకు జిల్లా కమిటీలో పదవులు భర్తీ చేశారు.

### శాతవాహన యూనివర్సిటీ పరిధిలో నేటి నుంచి సెలవులు

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 13: శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ, పీజీ కళాశాలలకు ఈనెల 14 నుంచి 24వ తేదీ వరకు బతుకమ్మ, దసరా సెలవులు ప్రకటిస్తూ యూనివర్సిటీ రిజిస్ట్రార్ వరప్రసాద్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 25న కళాశాలలు తెరుచుకుంటాయని పేర్కొన్నారు.

### డ్రంక్ అండ్ డ్రైవ్ లో ఇద్దరికి జైలు

రాంనగర్, అక్టోబర్ 13: కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడిన ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పు వెలువరించింది. నగరంలో తాగి వాహనాలు నడిపి పట్టుబడిన 16 మందిని కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచారు. కాగా, సయ్యద్ సమీర్‌కు పది రోజులు, వెల్ది మహేశ్‌కు మూడు రోజుల చొప్పున జైలు శిక్ష, జరిమానా విధించారు. 16 మందికి రూ.27,500 జరిమానా విధించారు.

### బాధిత కుటుంబాలకు సాయం

ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 13: సింగారానికి చెందిన మద్దూరి బాబు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ పక్షాన తక్షణ సాయంగా రూ.5 వేలు అందించారు. అలాగే బొప్పాపూర్‌కు చెందిన గుగ్గిల్ల నర్సయ్య అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా సదరు బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేశారు. ఇక్కడ సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు కొండాపురం బాల్‌రెడ్డి, ల్యాగల సతీశ్‌రెడ్డి, ముత్యాల చంద్రారెడ్డి, అంబటి నర్సయ్య, కొండాపురం శ్రీనివాస్‌రెడ్డి, గొల్లపల్లి సురేశ్, సింగారం దేవరాజు, వాసరవేని రాజు, నాగరాజు, రవీందర్, దేవయ్య, మల్లేశ్, నవీన్ తదితరులు ఉన్నారు.

### ప్రజాఆశీర్వాద సభను విజయవంతం చేయండి

వేములవాడ రూరల్, అక్టోబర్ 13 : ఈనెల 17న సిరిసిల్లలో జరిగే బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని వేములవాడ జడ్పీటీసీ మ్యాకల రవి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన అనుపురంలో మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రదాత, సీఎం కేసీఆర్ సిరిసిల్ల జిల్లాకు రావడం మనందరి అదృష్టమన్నారు. వేములవాడ బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు ఆధ్వర్యంలో పెద్దఎత్తున ప్రజా ఆశీర్వాద సభకు తరలివెళ్లాలన్నారు. ఇంటికి ఒకరు సభకు వచ్చేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. వేములవాడ మండలం నుంచి పెద్దఎత్తున ప్రజలు తరలిరావాలని కోరారు.

### ఆరోపణలు మానుకోవాలి

గంభీరావుపేట, అక్టోబర్ 13: గూడు లేని పేదలకు డబుల్ బెడ్రూం ఇండ్లు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇండ్ల నిర్మాణం చేపట్టిందని, అలాంటి ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు మానుకోవాలని గంభీరావుపేట మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ కటకం శ్రీధర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని శుక్రవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.